జ్యోతిష్మతిలో ఇన్నోఫెస్ట్-2025

మాట్లాడుతున్న కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు

తిమ్మాపూర్ రూరల్, ఫిబ్రవరి 24: మండల కేంద్రంలోని జ్యోతిష్మతి కళాశాలలో జ్యోతిష్మతి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ వార్షిక ఇంటర్ కాలేజియేట్ టెక్నికల్ ఈవెంట్ 'ఇన్నోఫెస్ట్ 2025' కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన ఎన్ఐటీ వరంగల్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.బి.వి. సుబ్రహ్మణ్యం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు సమాజానికి తమ వంతుగా ఉపయోగపడాలన్నారు. విద్యా విషయాలతో పాటు సమాజం విసురుతున్న సవాళ్లకు తమ మేధస్సుతో ఉపయుక్తమైన ప్రయోగాల ద్వారా లబ్ధి చేకూర్చాలని సూచించారు. కళాశాల చైర్మన్ సాగర్ రావు మాట్లాడుతూ, నేడు టెక్నికల్ క్విజ్, కోడ్ ఒ క్విజ్ (కోడింగ్), పోస్టర్ ప్రజెంటేషన్, ట్రెజర్ హంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అనిల్ కుమార్, అకాడమిక్ డీన్ పీకే వైశాలి, జిప్స్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ వి. రాజ్ కుమార్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'పారమిత' విద్యార్థుల ప్రతిభ

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 24 : చుక్కా లక్ష్మీబాయి సైన్స్ అవార్డు కౌన్సిల్ హైదరాబాద్ సారథ్యంలో ఇటీవల జరిగిన సైన్స్ టాలెంట్ సెర్చ్ పరీక్షలో స్థానిక పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపి, రాష్ట్రస్థాయిలో ర్యాంకులు పొందారని ప్రధానోపాధ్యాయుడు గోపీకృష్ణ తెలిపారు. అన్నాడి ఆశ్రిత్ రాష్ట్రస్థాయిలో 3వ ర్యాంకు, పబ్బతి విద్వాన్ రెడ్డి 6వ ర్యాంకు సాధించారని వెల్లడించారు. ఈ సందర్భంగా సైన్స్ టాలెంట్ సెర్చ్ పరీక్షలో రాష్ట్రస్థాయి ర్యాంకులు పొందిన విద్యార్థులను పాఠశాలల చైర్మన్ డాక్టర్ ఇ. ప్రసాదరావు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్స్ రశ్మిత, ప్రసూన, అనూకర్ రావు, రాకేశ్, వినోద్ రావు, వీయూఎం ప్రసాద్, టీఎస్‌వీ రమణ, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయుడు గోపీకృష్ణ, సమన్వయకర్తలు నాగరాజు, రాము, గైడ్ టీచర్ మహేందర్ పాల్గొన్నారు.

'సాయి మానేరు'లో ఫేర్ వెల్ హంగామా

క్యాట్ వాక్ చేస్తున్న విద్యార్థినులు

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 24 : జిల్లా కేంద్రంలోని సాయి మానేరు పాఠశాలలో సోమవారం హోసియార్ 2025 పేరిట నిర్వహించిన పదో తరగతి విద్యార్థుల ఫేర్ వెల్ కార్యక్రమం సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించింది. ఈ వేడుకలను మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. వేడుకల్లో పలువురు విద్యార్థులు ఫ్యాషన్ షో పేరిట చేసిన క్యాట్ వాక్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో మానేరు విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతా రెడ్డి, ప్రిన్సిపాల్ సరితా రెడ్డితో పాటు ఉపాధ్యాయులు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య కళాశాలలో ఫ్రెషర్స్ పార్టీ

తిమ్మాపూర్ రూరల్, ఫిబ్రవరి 24: మండలంలోని శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ డిజైన్ సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థుల ఫ్రెషర్స్ పార్టీని సోమవారం శ్రీ చైతన్య విద్యాలయ సంస్థల చైర్మన్ ముద్దసాని రమేశ్ రెడ్డి జ్యోతి ప్రజ్వల చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థులు క్రమం తప్పకుండా కళాశాలకు రావాలన్నారు. సీఎస్‌డీ విద్యార్థులకు ఉన్న ఉద్యోగావకాశాల గురించి వివరించారు. కళాశాలలో ఉన్న ల్యాబ్, లైబ్రరీ సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'కాంట్రాక్ట్ అధ్యాపకులకు సుప్రీంకోర్టులో ఊరట'

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 24: అధ్యాపకుల క్రమబద్ధీకరణపై ఇటీవల మిగిలిపోయిన 460 డిగ్రీ కాంట్రాక్ట్ అధ్యాపకులు, జూనియర్ కాంట్రాక్ట్ అధ్యాపకులు, నిరుద్యోగులు సుప్రీంకోర్టులో నవంబర్ 19న తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఎస్ఎల్‌పీ కేస్ వేయగా, ఊరట లభించినట్లు డిగ్రీ కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిడి కొండల్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కేసులో సోమవారం మొదటిసారిగా వాదనలు విన్న సుప్రీంకోర్టు ధర్మాసనం నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినట్లు కొండల్ రెడ్డి తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి

హుజూరాబాద్ టౌన్, ఫిబ్రవరి 24: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కోశాధికారి రాణా ప్రతాప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, 8500 కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదలకాక పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. విద్యారంగంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. కార్యక్రమంలో కాంసారపు రవితేజ, ఎండీ అస్లాం, కొయ్యడ బాబు, రాకేశ్, శేఖర్, అంజి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారిగా సురేశ్‌కుమార్

బాధ్యతలు స్వీకరించిన సురేశ్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఉద్యోగులు

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 24 : శాతవాహన యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌గా డాక్టర్ సురేశ్ కుమార్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జాన్సీ రవి కుమార్ నుంచి ఉత్తర్వులు అందుకున్నారు. గోదావరిఖని పీజీ కళాశాలలో ఫిజిక్స్ అధ్యాపకుడిగా పనిచేస్తున్న ఆయన ప్రస్తుతం కాన్ఫిడెన్షియల్ విభాగంలో అదనపు కంట్రోలర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను ఉద్యోగులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

గంగాధర, ఫిబ్రవరి 24 : మండలంలోని గట్టుభూత్కూర్ గ్రామ పరిసరాల్లో ఇటుక బట్టీలో పని చేస్తున్న కార్మికుల పిల్లల కోసం గ్రామంలో అధికారులు వర్క్‌సైట్ పాఠశాల ఏర్పాటు చేశారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల కోసం కలెక్టర్ పమేలా సత్పతి నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు, ఒడియా బుక్స్ పంపించగా, మండల విద్యాధికారి ప్రభాకర్‌రావు సోమవారం విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని చంద్రకళ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

చొప్పదండి, ఫిబ్రవరి 24: చొప్పదండి పట్టణంలోని ఉడిపి హోటల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ అనూష తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాగంపేట గ్రామానికి చెందిన ఒడ్నాల రమేశ్ (28) ఆదివారం రాత్రి సుమారు 10:30 గంటల సమయంలో పని ముగించుకొని ఇంటికి వెళ్లడానికి చొప్పదండి పట్టణంలోని ఉడిపి హోటల్ ముందు నిల్చొని ఉండగా, గుర్తు తెలియని కారు ఢీకొనడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ దవాఖానలో మార్చురీలో భద్రపరిచారు. మృతుడి బాబాయి ఇరుకుల్ల శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎండల తీవ్రతపై అప్రమత్తంగా ఉండాలి

- ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అవసరమైన సూచనలివ్వాలి
- కలెక్టర్ పమేలా సత్పతి

మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

విద్యానగర్, ఫిబ్రవరి 24: రానున్న రోజుల్లో ఎండల తీవ్రత పెరుగనున్నందున ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. ఎండల తీవ్రత, జాగ్రత్త చర్యలపై జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి జిల్లా అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. వేసవిలో నీటిని కొద్దికొద్దిగా ఎక్కువసార్లు తీసుకోవాలని సూచించారు. పాఠశాలల్లో విద్యార్థులు ఎక్కువసార్లు నీళ్లు తాగేలా చూడాలన్నారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో, అంగన్వాడీ కేంద్రాల్లో ఓఆర్ఎస్ అందుబాటులో ఉంచాలని, కేంద్రాలకు వచ్చే వారికి ఓఆర్ఎస్ ద్రావణం అందించాలని చెప్పారు. వృద్ధాశ్రమాల్లో ఉంటున్న వారికి నిమ్మరసం అందించాల్సిందిగా నిర్వాహకులకు తెలియజేయాలన్నారు. నిర్వహణ పనుల్లో భాగంగా విద్యుత్ నిలిపివేయాల్సి వస్తే ఉదయం, సాయంత్రం వేళలో మాత్రమే నిలిపివేయాలని ఎలక్ట్రిసిటీ అధికారులను ఆదేశించారు. వేసవిలో మొక్కలకు మల్చింగ్ చేసి సంరక్షించాలని సూచించారు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న అధికారులు సిబ్బంది జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎండలు తీవ్రంగా ఉన్న సమయంలో ప్రజలు ఏమి చేయాలో ఏమి చేయకూడదో సూచించే పోస్టర్లను జన సందోహం ఉండే ప్రాంతాల్లో అతికించాలన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో ఏర్పాటు చేసిన ప్రథమ చికిత్స కిట్ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎండ తీవ్రత కారణంగా మెడికల్ ఎమర్జెన్సీ ఏర్పడితే 108కి కాల్ చేయాలన్నారు. ప్రజలు ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని, మసాలా పదార్థాలు తగ్గించాలన్నారు. ఆరోగ్య సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రజలకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలని, అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎండ తీవ్రత జాగ్రత్తలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు ప్రపుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి సబిత, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సైలెన్స్ పీరియడ్‌లో ప్రచారం నిషేధం

- అభ్యర్థులు నిబంధనలు పాటించాల్సిందే
- ఆర్‌వో పమేలా సత్పతి

కలెక్టరేట్, ఫిబ్రవరి 24 : ఉత్తర తెలంగాణ జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయుల శాసనమండలి స్థానాల ఎన్నికల నేపథ్యంలో పోలింగ్‌కు 48 గంటల ముందు నుంచి కొనసాగే సైలెన్స్ పీరియడ్‌లో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎలాంటి ప్రచారం చేయకూడదని, నిబంధనలు ఉల్లంఘిస్తే ఎన్నికల సంఘం చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోదని ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతి స్పష్టం చేశారు. ఎలాంటి అభ్యంతరకరమైన, రాజకీయపరమైన అంశాలతో కూడిన ఎస్ఎంఎస్‌లు, బల్క్ ఎస్ఎంఎస్‌లు పంపడంపై కూడా ఎన్నికల సంఘం క్షుణ్ణంగా పరిశీలిస్తున్నదన్నారు. సైలెన్స్ పీరియడ్‌లో నిషేధ ఉత్తర్వులు ఉల్లంఘిస్తే విచారణ జరిపి, ప్రజాప్రాతినిధ్య చట్టం 1951, ఎన్నికల ప్రవర్తనా నియమావళి 1961 ప్రకారం జారీ అయిన సూచనలు, ఆదేశాల మేరకు బాధ్యులపై చర్యలు తప్పవని వెల్లడించారు. సైలెన్స్ పీరియడ్‌లో జిల్లాయేతర వ్యక్తులు కూడా జిల్లాలో ఉండకూడదని సూచించారు. ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, ఎంసీసీ, పోలీసు అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని, కళ్యాణ మండపాలు, హోటళ్లు, లాడ్జిల్లో విస్తృతంగా తనిఖీ చేపట్టాలని సూచించారు. కాగా, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సెక్షన్ 126(1)(బి) ఆర్పీ యాక్టు 1951 ప్రకారం ఒపీనియన్ పోల్స్, ఎగ్జిట్ పోల్స్ ప్రకటన నిషేధమని ఆర్‌వో పమేలా సత్పతి పేర్కొన్నారు. మండలి ఎన్నికలు ముగిసే దాకా ఎన్నికలు కొనసాగుతున్న ఆయా జిల్లాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలు విధిగా పాటించాలని సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

నిలిచిన రిజిస్ట్రేషన్లు.. రైతుల పడిగాపులు

మానకొండూర్ తహసీల్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లకు వచ్చి వేచి ఉన్న రైతులు ➤

మానకొండూర్ రూరల్, ఫిబ్రవరి 24: మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో సాంకేతిక కారణాలతో ధరణీ వెబ్‌సైట్‌లో భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిలిచిపోగా, రైతులు గంటల తరబడి పడిగాపులు పడ్డారు. సోమవారం మానకొండూర్ తహసీల్దార్ కార్యాలయంలో వివిధ గ్రామాల రైతులకు సంబంధించిన భూముల రిజిస్ట్రేషన్ కోసం ఐదుస్లాట్స్ బుక్ అయ్యాయి. భూ విక్రేతలు, కొనుగోలు దారులు, సాక్షులతో కలిసి తహసీల్దార్ రాజేశ్వరిని కలిశారు. డాక్యుమెంట్ల పరిశీలన పూర్తయ్యాక రిజిస్ట్రేషన్ కోసం ఆపరేటర్ దగ్గరికి చేరుకున్నారు. సర్వర్ పనిచేయకపోవడంతో అక్కడ జరుగాల్సిన ప్రక్రియ కోసం రోజంతా పడిగాపులు కాసి వారి వారి ఊర్లకు వెనుదిరిగారు. సాంకేతిక సమస్యపై ముందస్తు సమాచారం ఇచ్చి ఉంటే బాగుండేదని, తమకు ఇబ్బందులు తప్పేవని రైతులు పేర్కొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

శంకరపట్నం, ఫిబ్రవరి 24: ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్త వహించాలని హుజూరాబాద్ ఆర్టీసీ డీఎం రవీంద్రనాథ్ తెలిపారు. సోమవారం ఆయన వారసంత జరుగుతుండగా కేశవపట్నం బస్టాండ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆర్టీసీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. వారసంత సమయంలో ఆర్టీసీ బస్సులు బస్టాండ్‌లోకి వచ్చి వెళ్లే సమయంలో ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపట్టాలని చెప్పారు. అలాగే వారసంత వ్యాపారులు బస్టాండ్ ఆవరణలోకి రాకుండా చూడాలని చెప్పారు. సంతకు వచ్చే వారు ఇష్టారీతిన బస్టాండ్ ఆవరణలో వాహనాలను నిలుపుతుండడంతో బస్సుల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతున్నదన్నారు. ఈ సమయంలో జన సంచారం ఎక్కువగా ఉన్నందున పోలీసులు ట్రాఫిక్ క్రమబద్ధీరణకు సహకరించాలని కోరారు. ఇక్కడ ఆర్టీసీ సిబ్బంది, పోలీసు సిబ్బంది ఉన్నారు.

మెడికల్ ఆఫీసర్ బాధ్యతల స్వీకరణ

తెలంగాణచౌక్, ఫిబ్రవరి 24: ఆర్టీసీ కరీంనగర్ జోనల్ హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్‌గా ఏవీ గిరిసింహారావు జోనల్ హాస్పిటల్‌లో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మహబూబ్‌నగర్ జోనల్ హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్‌గా ఉన్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం మెడికల్ ఆఫీసర్‌కు డాక్టర్లు వసుధ, శివ, సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

వీణవంక, ఫిబ్రవరి 24: మండలంలోని మల్లారెడ్డిపల్లిలో చేపట్టిన శ్రీ రామాంజనేయ ఆలయ నిర్మాణానికి సోమవారం గ్రామానికి చెందిన మీసలత-సాగర్ దంపతులు రూ.1,00,116 విరాళం అందజేశారు. ఈ మేరకు చెక్కును మాజీ సర్పంచ్ మేకల ఎల్లారెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల ఉపాధ్యక్షుడు పల్లెర్ల కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫిలేటెలీ ఎగ్జిబిషన్

కరీంనగర్, ఫిబ్రవరి 24 : కరీంనగర్ హెడ్ పోస్టాఫీసులో సోమవారం కరీంనగర్ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కె.శివాజీ ఆధ్వర్యంలో ఫిలేటెలీ ఎగ్జిబిషన్ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సయ్యద్ తాహేర్ జీ (ఫిలేటెలిస్ట్) స్థానిక లెజెండ్ స్కూల్ విద్యార్థులకు ఫిలేటెలీ, అకౌంట్స్, స్టాంప్స్ సేకరణ, మైస్టాంప్ తదితర అంశాలపై క్షుణ్ణంగా వివరించారు. ఈ ఎగ్జిబిషన్‌లో పోస్టుమాస్టర్ తిరుపతి, పోస్టల్ ఇన్‌స్పెక్టర్లు అశోక్, చంద్రమోహన్, శ్రీనివాస్, ఐసో టీమ్ వ్యవస్థాపకుడు ఘనశ్యామ్ ఓఝూ, ఇతర పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న విద్యార్థులు ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేశారు.

ప్రభుత్వ పాఠశాలకు చేయూత

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 24 : ఐడీబీఐ బ్యాంక్ ఆధ్వర్యంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా కిసాన్ నగర్ కమాన్‌రోడ్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు 30 డ్యూయల్ డెస్క్ బెంచీలు, నాలుగు పుస్తకాల ర్యాక్‌లు, వెయ్యి లీటర్ల నీళ్ల ట్యాంకు వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి సీహెచ్ వీఎస్ జనార్దన్ రావు, ఆర్‌డీవో మహేశ్వర్ హాజరుకాగా, ఐడీబీఐ బ్యాంక్ హెడ్ శ్రీనివాస్, మేనేజర్ సందీప్, మండల విద్యాధికారి భద్రయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయిని లత, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది శైలజ, అరవింద్, బొల్లు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల 'పాలం బాట'

గన్నేరువరం, ఫిబ్రవరి 24: మండలంలోని మైలారంలో సోమవారం విద్యుత్ అధికారులు పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కరెంట్ సరఫరా, వోల్టేజ్, వ్యవసాయ మోటర్లకు సంబంధించిన విషయాలపై రైతులకు అవగాహన కల్పించారు. తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల ఎత్తు పెంచుతామన్నారు. కార్యక్రమంలో విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

మంత్రికి వినతి

వీణవంక, ఫిబ్రవరి 24: ఆర్టిజెన్ కార్మికులను కన్వర్షన్ చేయాలని ఆ సంఘం రాష్ట్ర నాయకులు ఊట్ల ప్రభుదాస శివ, శ్రీనివాస్, రమేశ్, రాజు సోమవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కరీంనగర్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. తమ వినతిపై మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు.

మాల మహానాడు నాయకుల ముందస్తు అరెస్ట్

పోలీసుల అదుపులో మాల మహానాడు నాయకులు

తెలంగాణచౌక్, ఫిబ్రవరి 24: ఎస్సారార్ కళాశాలలో సోమవారం నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి సభను అడ్డుకుంటారన్న నేపంతో మాల మహానాడు నాయకులు నల్లల కనకరాజు, గంటల రేణుక, బొగ్గుల మల్లేశం, గంటల మహేందర్, మద్దెల రాజేందర్‌ను మూడో టౌన్ పోలీసులు ఉదయమే ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. సీఎం సభ ముగిసిన తర్వాత వదలి పెట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి పోలీసులతో నిర్బంధాలు చేస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

బీసీలు రాజ్యాధికారం సాధించుకోవాలి

తెలంగాణచౌక్, ఫిబ్రవరి 24 : దేశ జనాభాలో 60 శాతం ఉన్న బీసీలు రాజ్యాధికారాన్ని సాధించుకోవాలని సామాజిక వేత్త, ఉద్యమకారుడు తెలంగాణ విఠల్, తెలంగాణ నిరుద్యోగుల జేఏసీ అధ్యక్షుడు డాక్టర్ మహిపాల్ యాదవ్ పిలుపునిచ్చారు. నగరంలోని ప్రెస్ భవనంలో సోమవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, బీసీలు రాజకీయ, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో వెనుకబడినట్లు తెలిపారు. రాజ్యాధికారంతోనే బీసీల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. బీసీలు ప్రజాపతినిధులుగా ఎదగాలన్నారు. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ఉన్న బీసీ అభ్యర్థులు ప్రసన్న హరికృష్ణగౌడ్, మల్క కొమురయ్యకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో బీసీ జేఏసీ నాయకుడు లక్ష్మణ్ పాల్గొన్నారు.

బస్సు చార్జీలు తగ్గించాలని వినతి

తెలంగాణచౌక్, ఫిబ్రవరి 24: హిందూ పండుగల సందర్భంగా ఆర్టీసీ నడిపే ప్రత్యేక బస్సుల్లో అదనపు చార్జీలు తీసుకోవద్దని హిందూ జనజాగృతి సమితి జిల్లా కన్వీనర్ సత్యనారాయణాచారి సోమవారం ఆర్టీసీ ఆర్ఎం చాంబర్‌లో ఆర్ఎం రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హిందూ పండుగల సందర్భంగా దేవాలయాల సందర్శనకు వెళ్లే వారి నుంచి అదనపు చార్జీలు ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. ఆర్టీసీ అన్ని మతాల వారిని ప్రయాణికులుగానే చూడాలని, కేవలం హిందూ పండుగల రోజుల్లో చార్జీ పెంచడం సరికాదన్నారు. ఆర్టీసీ యాజమాన్యం పెంచిన ధరలను తగ్గించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా హిందూ సంఘాలతో కలిసి ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

'ఆ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి'

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 24 : నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లు చేస్తూ, అధిక ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారికి పీడీఎస్‌యూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా విద్య పూర్తిగా వ్యాపారం అయిందని, మోడల్ స్కూల్స్, ఈ టెక్నో, ఫౌండేషన్, డీజీ, మెడిసిన్, ఐఐటీ ఫౌండేషన్, సివిల్స్ లాంటి తోక పేర్లు తగిలించుకొని యథేచ్ఛగా రూ.లక్షల్లో ఫీజులు వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అలాంటి పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇక్కడ జిల్లా ఉపాధ్యక్షుడు లోకిని రమేశ్, నాయకులు పల్లవి, వైష్ణవి, వెన్నెల తదితరులు ఉన్నారు.

ట్రాన్స్ ఫార్మర్ ప్రారంభం

ముకరంపుర, ఫిబ్రవరి 24: నగరంలోని టౌన్-7 సెక్షన్ సప్తగిరి కాలనీ, శ్రీనగర్ కాలనీలోని ఎస్ఎస్-59, 7ల పై ఓవర్ లోడ్ భారాన్ని తగ్గించేందుకు అదనంగా ఏర్పాటు చేసిన 100కేవీఏ ట్రాన్స్ ఫార్మర్‌ను సోమవారం ఎస్ఈ రమేశ్ బాబు, డీఈ రాజు ప్రారంభించారు. కార్యక్రమంలో టౌన్-2 ఏడీఈ లావణ్య, ఏఈ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్‌వై నియోజకవర్గ ఇన్‌చార్జి

కేసీఆర్‌తో బంధారపు అజయ్ కుమార్

చొప్పదండి, ఫిబ్రవరి 24: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఎర్రవల్లిలోని నివాసంలో పార్టీ యువజన విభాగం చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి బంధారపు అజయ్ కుమార్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నేటితరం యువతలో ఆనాటి తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని నింపాలని, ఎన్నికల హామీలపై కాంగ్రెస్‌ను నిలదీయాలని కేసీఆర్ సూచించారని అజయ్ తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రతి సమస్యపై స్పందించాలని, త్వరలోనే పార్టీకి పునర్ వైభవం వస్తుందని స్పష్టం చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ చీకట్ల రాజశేఖర్, మాజీ ఎంపీటీసీ పిడుగు తిరుపతి, సీనియర్ నాయకులు ఉష్కమళ్ల మధు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయ